క్లుప్తంగా

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం



ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామ పంచాయతీ పరిధిలోని దేవీ నగర్ బస్తీలో బుధవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుమల విద్యాసంస్థల నిర్వాహకుడు నున్న కృష్ణ, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణ గౌడ్, సంఘ్ ప్రముఖ్ తొగరు సత్యనారాయణ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని, నదీ ప్రవాహంలా ప్రజలకు సేవ చేస్తోందని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిరంతరం కృషి సాగిస్తోందని తెలిపారు. గతంలో సంస్థ స్ఫూర్తిని అణచివేసేందుకు తప్పుడు కేసులు బనాయించడం, నిషేధించడం వంటి అనేక ప్రయత్నాలు జరిగినా ఆర్‌ఎస్‌ఎస్ అన్నింటినీ తట్టుకొని నిలబడిందన్నారు. సుభాషితం పిచ్చిక వెంకట రాంబాబు, అమృత వచనం కత్తుల పెరుమాళ్ రాజు చెప్పగా, గీత్ భీమశంకరం చేశారు. స్టేట్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, సంఘ్ సేవక్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కడియం: కడియం, కడియపుసావరం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. కడియం జెడ్పీ హైస్కూల్లో సైన్స్ బ్లాక్, కడియపుసావరంలో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కడియపుసావరంలో సీసీ రోడ్డు, సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ స్వీయ నిధులతో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ గణేష్

ధవళేశ్వరం: తల్లిదండ్రులను పిల్లలు ప్రేమతో చూసుకోవాలని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ అన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీఐ గణేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, సిటిజన్ కార్డులు, ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేవీఆర్ సాగర్, బసవబోయిన దుర్గ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరామర్శ



బోస్‌ను పరామర్శిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 25వ డివిజన్‌లో కాపు సంఘ సీనియర్ నాయకుడు అర్లపల్లి బోసును వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులకు సూపర్ జీఎస్టీ 2.0 అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షత వహించగా, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఎస్టీ 2.0 వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.షణ్ముఖరావు, వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏఏ అన్నపూర్ణ, డాక్టర్ వీవీవీ సత్యవతి, ఆనందరావు, పవన్ కుమార్, దీక్షిత పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఎస్‌వీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహన డైరెక్టర్లకు సత్కారం

కడియం: ఇటీవల రాష్ట్ర కుమ్మర శాలివాహన డైరెక్టర్లుగా నియమితులైన దాలిపర్తి వేమన, పండూరి అప్పారావు, విజయకుమారిలను వీరవరంలోని కమ్యూనిటీ హాల్లో బుధవారం కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఒక్కటై ముంచేశారు



షాపులు ఎక్కువగా ఉండే కోటగుమ్మం ఏరియా



పని గంటల పెంపుపై నిరసన తెలుపుతున్న నాయకులు (ఫైల్)

- కార్మికులపై కూటమి ప్రభుత్వ కక్ష
- పని గంటలు పెంచుతూ నిర్ణయం
- బిల్లును ఆమోదించిన టీడీపీ, బీజేపీ, జనసేన
- మండిపడుతున్న శ్రామికులు

సీటీఆర్ఐ: కార్మిక వర్గం అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చి, అదనంగా మరో రెండు గంటల పాటు పని చేసేలా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన కూటమి ప్రభుత్వంపై కార్మికులు మండి పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోగా అదనంగా రెండు గంటల పాటు పని చేయించుకోవడం అంటే తమ శ్రమను దోచుకోవడమే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌లోని అంశాలను రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు చేయడాన్ని ఖండిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఎన్డీఏ పార్టీలు అన్ని కలిసి ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేసే కార్మికుల పని గంటల పెంపును ఆమోదించడం దారుణమని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కనీస వేతనాలు పెంచని ప్రభుత్వం.. పని గంటలు పెంచడంతో భగ్గుమంటున్నారు. కార్మిక వర్గంపై కనీస చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓటీకి టాటా

పరిశ్రమలు, దుకాణాల్లో ఇప్పటి వరకూ 8 గంటల పని విధానం అమల్లో ఉంది. కార్మికులు అదనంగా గంటో, రెండు గంటలో పనిచేస్తే వారికి ఓటీ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ఎందుకంటే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల కార్మికులు ప్రతిరోజు అదనంగా మరో రెండు గంటలు పనిచేయాల్సి వస్తుంది. దీని వల్ల వ్యాపారవేత్తలకు లాభం ఉంటుంది. కానీ కార్మికులకు అదనంగా ఒక్క రూపాయి కూడా రాదు.

మహిళలకు రక్షణ కరవు

మహిళలు అదనంగా మరో రెండు గంటలు పని చేయడం వల్ల రాత్రి సమయాలలో ఇంటికి చేరాల్సి వస్తుంది. దీని వల్ల వారికి రవాణా సమస్యలు ఏర్పడతాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కరవైంది. ఇక రాత్రి సమయాలలో వారు ప్రయాణం చేయడం వల్ల పూర్తిగా రక్షణ లేని పరిస్థితి కలుగుతుంది.

సుమారు 60 వేల మందిపై భారం

జిల్లాలోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరంలో అనేక ఆస్పత్రులు, మాల్స్, దుస్తుల షాపులు, నగల దుకాణాలు ఉన్నాయి. నగరంలోని ఉన్న అన్ని షాపుల్లో సుమారు 60 వేల మందికి పైగా పని చేస్తున్నారని అంచనా. ఇప్పటి వరకూ వీటిలో మూడు షిఫ్టులుగా పని చేసేవారు. ఇక నుంచి అవి రెండు షిఫ్టులకే పరిమితమవుతాయి. దానవాయిపేట, మెయిన్ రోడ్డు, గోకవరం బస్టాండ్ రోడ్డు, తిలక్ నగర్, ప్రకాశం నగర్, తాడితోట వంటి చోట్ల షాపులు, మాల్స్, హాస్పిటళ్లు అధికంగా ఉన్నాయి. వీటిలో పనిచేసే వారందరూ ఇప్పుడు రోజుకు పది గంటల చొప్పున పని చేయాల్సి ఉంటుంది.

పని భారం తగ్గించాలి



ప్రస్తుతం కార్మికులకు ఎనిమిది గంటల పనిచేయడమే భారంగా మారింది. దాన్ని పది గంటలకు పెంచడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుండా పారిశ్రామిక అవసరాల కోసం 12 గంటల పాటు చేయించుకోవచ్చు అనే వెసులుబాటును బిల్లులో పెట్టి, దాన్ని కూడా ఆమోదించారు. దీంతో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతారు.

– బి.పవన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రతికూల ప్రభావం



ప్రస్తుతం అన్ని చోట్లా యాంత్రీకరణ పెరగడం వల్ల కార్మికులు పని చేయాల్సిన వేగం కూడా ఎక్కువైంది. ఈ తరుణంలో ఉన్న పని గంటలు తగ్గించాల్సింది పోయి, అదనంగా పెంచడం దారుణం. దీని వల్ల కార్మికులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి.

– కర్రి రామకృష్ణ, హార్లిక్స్ ఫ్యాక్టరీ వర్కర్

మాజీ మంత్రి వేణు పరామర్శ



భానుప్రసాద్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: శస్త్ర చికిత్స చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పందెళ్ల భానుప్రసాద్‌ను బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి వెంట నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), దేవులపల్లి సరితా రాణి, గోలి దేవ కుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, గునిపే అశోక్, ముత్యాల పోసికుమార్, షట్టర్ బాషా, గూటం రాజు, ముత్యాల జాన్, చప్పిడి జ్యోతి, మస్తాన్ బేగ్, దాసరి ధర్మ, బూన్ తదితరులు ఉన్నారు.

ఆటోడ్రైవర్‌ను బెదిరించిన రౌడీ షీటర్ అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: ఆటో డ్రైవర్‌ను బెదిరించి, బీరు బాటిల్‌తో ఆటో అద్దం పగలగొట్టి, నగదు లాక్కున్న రౌడీ షీటర్ కందివలస రాజు(నట్టు)ను అరెస్టు చేసినట్లు బొమ్మూరు పీఎస్ ఎస్సై కొమరపు రమేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శాటిలైట్‌సిటీ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తమ్మిపాల శ్రీనివాసరావు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వెళుతున్నాడు. మార్గం మధ్యంలో అదే గ్రామానికి చెందిన రౌడీ షీటర్ కందివలస రాజు (నట్టు) ఆటోను ఆపి, రూ.1000 ఇవ్వాలని అడిగాడు. అయితే శ్రీనివాసరావు డబ్బులు లేవని చెప్పడంతో బీరు బాటిల్‌తో ఆటో అద్దం పగలగొట్టాడు. తాను రౌడీనని ఈ ఏరియాలో అందరూ తాను చెప్పినట్టు వినాలని బెదిరించాడు. దీంతో శ్రీనివాసరావు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగానే సదరు రౌడీషీటర్ కందివలస రాజు.. ఎవరైనా దగ్గరికి వస్తే చంపేస్తాను అంటూ చేతిలోని కత్తిని చూపించి బెదిరించాడు. శ్రీనివాసరావు జేబులోని రూ.500 బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రిపోర్ట్ ఇస్తే బాంబులు వేసి చంపేస్తానని వార్నింగ్ ఇచ్చాడు. అనంతరం బాధితుడి ఫిర్యాదుపై బొమ్మూరు ఎస్సై కొమరపు రమేష్ కేసు నమోదు చేశారు. రౌడీ షీటర్ కందివలస రాజును 24 గంటల్లోపే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

ఓట్ల దొంగతనం ప్రజాస్వామ్యానికి విఘాతం



మీడియాతో మాట్లాడుతున్న జేడీ శీలం

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడిందని.. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జేడీ శీలం విమర్శించారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బిహార్, కర్ణాటకలో భారీ సంఖ్యలో నకిలీ ఓట్లు నమోదయ్యాయని ఆరోపించారు. అయినా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. వీటిపై కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తుంటే ఈసీ మౌనం వహిస్తోందని విమర్శించారు. ఓట్ చోర్.. గద్దె చోడ్ నినాదంతో కూడిన కరపత్రాలపై ప్రజల నుంచి సంతకాల సేకరిస్తున్నామన్నారు. వీటిని ఈసీకి అందజేస్తామని చెప్పారు.

విద్యార్థిని ఆత్మహత్య

కంబాలచెరువు: సెల్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతున్నావంటూ తండ్రి మందలించడంతో ఒక విద్యార్థిని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. గాదిరెడ్డి నగర్‌కు చెందిన వుండ్ర మోహన్‌కృష్ణ హార్లిక్స్ ఫ్యాక్టరీలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య కువైట్‌లో ఉంటోంది. వారికి అలేఖ్య, అనూష అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో అలేఖ్య (22) డిగ్రీ చదువుతోంది. ఆమె సెల్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతుండడంతో తండ్రి మందలించి డ్యూటీకి వెళ్లిపోయాడు. దీంతో అలేఖ్య మనస్తాపానికి గురైంది. తనకు తలనొప్పిగా ఉంది, ట్యాబ్లెట్ తీసుకు రమ్మని చెల్లెలు అనూషను మెడికల్ షాపునకు పంపింది. ఆమె తిరిగి వచ్చేలోపు ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పేలుడు విచారకరం

అనపర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామ పరిధి కొమరిపాలెం శివారులో ఉన్న గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బుధవారం జరిగిన పేలుడు విచారకరమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఘటనలో పలువురు మృతి చెందడం హృదయాన్ని కలచివేసిందన్నారు.

సైబర్ సెక్యూరిటీలో విస్తృతంగా ఉద్యోగాలు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ్ రామస్వామి

రాజానగరం: రాబోయే కాలంలో సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగావకాశాలు విస్తృతంగా ఉంటాయని, వాటిని అందిపుచ్చుకునేలా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కేపీఎంజీ ఇన్ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ పార్టనర్ నారాయణ్ రామస్వామి అన్నారు. ఆ సంస్థ స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)తో కుదుర్చుకున్న ఒడంబడిక నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. సురక్షితమైన డిజిటల్ ప్రపంచ నిర్మాణానికి సుశిక్షిత మానవ వనరుల అవసరం అత్యంత కీలకమన్నారు. ప్రొ.చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ రాబోయే నాలుగేళ్లలో సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జీజీయూ వీసీ డాక్టర్ యు. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్‌శర్మ, కేపీఎంజీ డైరెక్టర్ మహావీర్ అగర్వాల్, ది ఫున్నెల్ స్టోరీ వ్యవస్థాపకుడు సుమంత్ పాలెపు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాక్సింగ్ పోటీలు

ప్రకాశం నగర్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు 69వ అంతర్ జిల్లాల బాక్సింగ్, ఉషో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మలావలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 11 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పోటీల్లో బాక్సింగ్ అండర్- 14, 17, 19 బాలురు, బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. 13 జిల్లాల నుంచి సుమారు 1,650 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతారని, 102 వెయిట్ విభాగంలో విజేతలైన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

సీతానగరం: మండలంలో ఇళ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ ఎస్.బుజ్జి సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. తొలుత సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీలోని సిమెంట్ గోడౌన్‌ను పరిశీలించారు. అక్కడి స్టాక్ రిజిస్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ యు.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలో 269 హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంగా నిర్ణయించగా, వాటిలో వంద ఇళ్లు పూర్తయ్యాయన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో 25, లింటల్ లెవెల్‌లో 112, రూఫ్ లెవెల్‌లో 49 ఉన్నాయని వివరించారు.

14న 'నన్నయ'లో యువజన పోటీలు

రాజానగరం: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ (కాకినాడ)ల ఆధ్వర్యంలో 15 నుంచి 19 సంవత్సరాల వయసులో ఉన్న యువజనులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారని సెట్రాజ్ సీఈఓ కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. యువతీయువకులు తమలో దాగివున్న ప్రతిభను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు వీలుగా ఈ పోటీలు ఉంటాయన్నారు. సాంస్కృతిక ట్రాక్ విభాగంలో జానపద నృత్యం (బృందం), జానపద గేయం (బృందం), కథ రాయడం, కవిత్వం, పెయింటింగ్, డిక్లమేషన్ పోటీలు ఉంటాయి. ఇన్నోవేషన్ ట్రాక్‌లో సైన్స్ మేళా ప్రదర్శన అంశంలో జిల్లా స్థాయిలో యువజనోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో ప్రథమ స్థాయిలో విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ కూడా ప్రథమ స్థానంలో నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకుగాను ముందుగానే తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవలసి ఉంది. 98499 13065, 89191 35344కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చు లేదా సెట్రాజ్ కెకెడి2013కి మెయిల్ చేయవచ్చన్నారు.

మార్కెట్‌లోకి బొలెరో నియో కారు విడుదల



బొలెరో నియో కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని మహీంద్రా డీలర్ అయిన ఎంఅండ్ఎస్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూమ్‌లో బుధవారం బొలెరో నియో మోడల్ కారును విడుదల చేశారు. రిఫ్రెష్ డిజైన్, మెరుగైన కంఫర్ట్, స్మార్ట్ కనెక్టివిటీతో తదితర ఫీచర్లతో ఈ కారును రిఫ్రెష్ చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ స్లీక్ న్యూగ్రిల్, 16 అల్లోయ్ వీల్స్, కొత్తగా డ్యూయల్ టోన్ కలర్స్, లెథెరెట్ అప్హోల్స్టరీ, కొత్త ఇంటీరియర్ థీమ్, ఆరు రంగులు, రేర్ కెమెరా, 22.8 సెం.మీ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, మల్టీ టార్రైన్ టెక్నాలజీతో కొత్త వేరియంట్ బొలెరో నియో ఎన్-11ను పరిచయం చేశామన్నారు. ఈ కారు ధర రూ.8.49 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి తనిఖీలు



విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి బుధవారం బొమ్మూరులోని ఏంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని బ్లైండ్ స్కూల్, బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వసతులు, ఆహార సదుపాయాలను పరిశీలించి తక్షణం మెరుగుపర్చుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తొలి రోజు రాజమహేంద్రవరం డివిజన్‌లో పర్యటించామని, గురువారం కొవ్వూరు డివిజన్‌లో తనిఖీలు చేస్తామని తెలిపారు. డీఎస్‌వో వి.పార్వతి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శశాంక, డీఎం గణేష్ కుమార్, ఏఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, ఏజీపీవో ఎం.రంగా ప్రసాద్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను కాపాడుకుందాం

రాజానగరం: అడవులను రక్షించుకుందాం – వన్యప్రాణులను కాపాడుకుందాం అనే నినాదంతో మండలంలోని పుణ్యక్షేత్రంలో రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వన్యప్రాణి వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మానవ – జంతు సహజీవనం, మిషన్ లైఫ్ (పర్యావరణానికి జీవనశైలి), ప్లాస్టిక్ నిర్మూలన తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలోని ఊర చెరువు గట్టున ఉన్న తుమ్మ చెట్లను ఆవాసం చేసుకుని ఉంటున్న సైబీరియన్ పక్షుల గురించి వివరిస్తూ, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. మానవ మనుగడకు వన్య ప్రాణుల ఆవశ్యకతను తెలియజేశారు. సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దివాన్ చెరువు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వి.పద్మావతి, ఫారెస్టు బీట్ ఆఫీసర్ జీవీ రంగారావు, విశ్రాంత అధికారి ఎల్.భీమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇందిరాలక్ష్మిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా కె.ఇందిరాలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె విశాఖ జిల్లా అన్నవరం ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.అఖిల నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వదలని మత్తు

- ఏరులై పారుతున్న మద్యం
- యథేచ్ఛగా దుకాణాల ఏర్పాటు
- ఘర్షణకు దిగుతున్న మందుబాబులు

కోరుకొండ: కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం ఏరులై పారుతోంది. అనుమతి పొందిన దుకాణాలతో పాటు అనధికారికంగా ఏర్పాటు చేసిన బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్నాయి. అలాగే ఇటీవల అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం ఫ్యాక్టరీ గుట్టురట్టు కావడంతో స్థానిక మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటిలో రెండింటిని కోరుకొండలో ఏర్పాటు చేశారు.

తరచూ కొట్లాటలు

మద్యం దుకాణాల వద్ద తరచూ కొట్లాటలు జరుగుతున్నాయి. నిర్దీత సమయ నిబంధనలు పాటించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోరుకొండ మండలంలోని గాడాల బ్రాందీషాపు వద్ద ఇటీవల మధురపూడికి చెందిన పాముల శ్రీనుపై దాడి జరిగింది. చిన్నగా మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు దారి తీసింది. సెప్టెంబరు 30వ తేదీన జరిగిన ఈ దాడిలో శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల సహాయంతో చికిత్స కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చేరాడు. దాడి చేసిన నిందితులపై పోలీసులు అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలి. మరి కొందరు పరారీలో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. అక్రమ లాభార్జన కోసం కొందరు మద్యాన్ని కల్తీ చేస్తున్నారు. మద్యం ప్రియుల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. ప్రభుత్వం అండతోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా కల్తీ మద్యం బ్రాండ్లు రాజానగరం నియోజకవర్గంలో ఉన్నాయా అనే సందేహాలున్నాయి.

నిబంధనలు బేఖాతరు

ప్రభుత్వం నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత దుకాణాల్లో వ్యాపారాలను నిలిపివేయాలి. కానీ క్షేత్రస్థాయిలో దానికి విరుద్ధంగా జరుగుతోంది. ఏ సమయంలోనైనా మందు దొరుకుతోంది. ఈ నేపథ్యంలో దుకాణాల వద్ద గొడవలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.



కోరుకొండలోని ఓ దుకాణంలో మద్యం సీసాలు

మందుబాబుల జేబులు గుల్ల

మద్యం సీసాలను ఎంఆర్‌పీ కంటే రూ.10 అదనంగా వేసుకుని విక్రయిస్తున్నారు. ముఖ్యంగా మద్యం సీసాలపై స్టిక్కర్‌లో ఈ అదనపు ధర ఉండడం లేదు. ఇతర ఖర్చుల పేరిట జరుగుతున్న వసూలుతో మందుబాబులు నష్టపోతున్నారు.



శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలోని మద్యం దుకాణం

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలోని మద్యం దుకాణం

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

కల్తీ మద్యం అమ్మకాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. మద్యం దుకాణాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిఘా ఏర్పాటు చేయాలి. అదనపు వసూలును అరికట్టాలి.

– కె. రాజా రమాదేవి, మహిళా విభాగం కన్వీనర్, రాజానగరం నియోజకవర్గం

కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒక పక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమంతో జోడు గుర్రాల స్వారీ చేస్తోందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన మాట ప్రకారం పింఛన్ రూ.4 వేలకు పెంచిందన్నారు. కానీ వైఎస్సార్ సీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు రూ.పది వేలు చొప్పున ఇస్తే.. తమ ప్రభుత్వం రూ.15 వేలు ఇచ్చిందని చెప్పారు.